క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

కందుకూరు: డ్రగ్స్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని సీఐ సీతారామ్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్త గూడ పరిధి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనతో పాటు సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చెడు అలవాట్లతో తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ సైదులు, ప్రిన్సిపాల్ మంగరాజు, అధ్యాపకులు సైదులు, పర్వతాలు, జ్యోతి, రాంరెడ్డి, శ్రీనివాస్, రాధ, ప్రవీణ, యాదయ్య, పెద్దయ్య, రాఘవులు, సుధ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని రక్షించాలంటూ ఫిర్యాదు



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

మీర్‌పేట: కబ్జాకు గురైన పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మిరాజు సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. జనప్రియా మహానగర్ 5వ బ్లాకులో మొత్తం 118 ఫ్లాట్లు ఉన్నాయని, తమ బ్లాకులోని పార్కింగ్ స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఆక్రమించి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని, కావున కబ్జాకు గురైన పార్కింగ్ స్థలాన్ని రక్షించాలని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

మహేశ్వరం: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను సోమవారం మహేశ్వరం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కి తరలించారు. మరి కొందరిని ఎక్కడికి బయటకి వెళ్లకుండా హౌస్ అరెస్టు చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్దామంటే తమను బలవంతంగా అరెస్టులు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో సిరిగిరిపురం, డబిల్‌గూడ మాజీ సర్పంచ్‌లు కాసుల సురేష్, బుగ్గని శంకర్, బీజేపీ నాయకులు శ్రీరాములుయాదవ్‌లు ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం సన్నవడ్లకు రూ.500 బోనస్ అమలు చేయడం శుభపరిణామమన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ లాగానే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడి రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు ఎస్.వెంకట్‌రాంరెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి, నాయకులు సయ్యద్ అజీజ్, ఆలేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- అలంకారప్రాయంగా దుకాణ సముదాయ షెడ్లు
- వినియోగంలోకి తేవడంలో అధికారుల నిర్లక్ష్యం
- మడిగెల కోసం ఎదురు చూస్తున్న చిరు వ్యాపారులు



దుకాణ సముదాయం షెడ్లు

మీర్‌పేట: రూ.లక్షలు వెచ్చించి వీధి వ్యాపారుల కోసం నిర్మించిన దుకాణ సముదాయం మడిగలను నిర్లక్ష్యంగా వదిలేశారు. నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా.. వినియోగంలోకి తేవడం మరిచారు. దీంతో అవి అలంకారప్రాయంగా మిగిలాయి. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మంత్రాల చెరువు వద్ద జూన్ 25, 2022లో నాటి మంత్రి, నేటి ఎమ్మెల్యే సబితారెడ్డి దుకాణ సముదాయ షెడ్లకు శంకుస్థాపన చేశారు. అందుకు రూ.60 లక్షల నిధులు కేటాయించారు. 2023 అక్టోబరులో 46 మడిగలతో కూడిన నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా.. లబ్ధిదారులకు కేటాయించకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్భాటంగా ప్రారంభించి, నిర్మించి గాలికి వదిలేశారని, పరిస్థితి ఇలాగే ఉంటే.. వినియోగంలోకి రాకముందే.. శిథిలావస్థకు చేరుకుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

సముదాయం పూర్తయ్యాక, క్యాబిన్లు ఏర్పాటు చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయిస్తామని మున్సిపల్ అధికారులు చెప్పారని, అయినా ఆ దిశగా వారు చర్యలు తీసుకోవడం లేదని పలువురు వ్యాపారులు తెలిపారు. షెడ్లను ఇలా వదిలేయడం వలన, అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, షెడ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు.

వారం రోజుల్లో అప్పగిస్తాం

లబ్ధిదారులకు షెడ్లు కేటాయించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశించారు. అయినప్పటికీ కేటాయింపులో ఆలస్యం జరుగుతోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. వారం రోజుల్లోగా సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చి, అర్హులైన వీధి వ్యాపారులకు అప్పగిస్తాం.

–ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మేయర్, మీర్‌పేట కార్పొరేషన్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ తదితరులు

పహాడీషరీఫ్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి సూచించారు. మామిడిపల్లిలో దాసాంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెమెరాలను సోమవారం ఆయన కార్పొరేటర్లు శివకుమార్, పవన్ కుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆలయాల వద్ద పలు ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. కెమెరాల ఏర్పాటుతో సంబంధిత వ్యక్తులను గుర్తించేందుకు వీలుంటుందన్నారు. చోరీలు జరగకుండా బస్తీల్లో ప్రజలు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్, బాల్‌రాజ్ యాదవ్, లిక్కి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య



ఏపీఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

తలకొండపల్లి: మహిళా సమాఖ్యలో పని చేస్తున్న వీవోఏలకు కనీస వేతనం నెలకు రూ.20 వేలు చెల్లించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రం మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పెంటయ్య ఆధ్వర్యంలో వీవోఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలకు, గ్రామ సంఘాలకు స్త్రీ నిధి ఇంటెన్సివ్ విడుదల చేయాలన్నారు. ప్రతి గ్రామ సంఘానికి ఒక ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని, రూ.20 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. అనంతరం ఏపీఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి కృష్ణారెడ్డి, వీవోఏలు నరసింహ, స్వప్న, అరుణ, శశికళ, మంగమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



30వ డివిజన్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌కాలనీలో, అలాగే 20వ డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్‌లలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు భీమిడి స్వప్నజంగారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకుంటాం

జేఏసీ నాయకులు



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: ఎంతవరకైనా పోరాడతాం.. గట్టుఇప్పలపల్లి మండలాన్ని సాధించుకుంటామని జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఎదుల శరత్‌చంద్ర, లక్క నాయక్, చంద్రు నాయక్, నరసింహ గౌడ్, నాగయ్య, రామయ్య, నర్సింహులు, బాలయ్య, షరీఫ్, మాణిక్య రెడ్డి, అనిల్, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి 23వ వార్డు లక్ష్మారెడ్డిపాలెం కాలనీలో రూ.20లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి వార్డుల్లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు వేశామని, మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, విద్యావిజయేందర్‌రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, సాయిబృందావన్ ట్రస్ట్ చైర్మన్ నారాయణస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగార్జున, లక్ష్మారెడ్డిపాలెం కాలనీ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, స్థానికులు బాబురావు, శివాగౌడ్, మజీద్‌బాబా, శ్రీనాథ్‌రెడ్డి, సాయి, నరేందర్‌లు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- ధాన్యం చెతికొచ్చినా.. కొనుగోలు కేంద్రాలు లేవు
- జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ విమర్శించారు. రైతులు పండించిన ధాన్యం చేతికొచ్చినా.. ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోయిందని ఆరోపించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యాన్ని టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ధాన్య తెచ్చి రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదని, నిల్వ చేసుకోవడానికి సరైన వసతులు లేవని అన్నదాతలు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం అనురాధ మాట్లాడారు. ధాన్యం చేతికి వచ్చినా, వాటిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధరతో పాటు.. అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు లాలయ్యగౌడ్, బాలస్వామి, రమేశ్‌నాయక్, వెంకటేశ్, శివకుమార్, యాదయ్య, ప్రసాద్, గణేశ్, ఆనంద్, మహేశ్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అనురాధ

దళారులను నమ్మి మోసపోవద్దు

పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పాండు, వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు

మహేశ్వరం: ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులని నమ్మి తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, రైతులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యానికి కనీస మద్దతు ధరను అందిస్తుందని, ప్రతీ రైతు ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2300లతో సన్నాలకు రూ.500లు బోనస్ ఇస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు రైతుల ధాన్యాన్ని సహకార సంఘం అధికారులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నాగమణి, పీఏసీఎస్ డైరెక్టర్లు కె. రాకేశ్‌రెడ్డి, పి.బాలయ్య, కె.ప్రభాకర్, జయమ్మ, పీఏసీఎస్ సీఈఓ షఫీ, అసిస్టెంట్ సీఈఓ అయిలయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. వీఓఏలు 20 సంవత్సరాలుగా సమస్యల పరిష్కరించాలని కోరుతూ అనేక రకాలుగా పోరాటం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్‌ల ఎదుట 48 గంటల ధర్నా నిర్వహించనున్నామన్నారు. వీఓఏలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీఎం కవితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విశారద, శోభ, లక్ష్మి, భారతమ్మ, అండాలు, కవిత, రేణుక, సబిత, అశ్విని పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తదితరులు

కందుకూరు: వరి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్ ధర రూ.2320, సాధారణ రకం రూ.2300లకు సేకరిస్తున్నామన్నారు. సన్న రకానికి అదనంగా రూ.500 బోనస్ అందుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.ఆనంద్, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నర్సింహ, జి.పర్వతాలు, జి.అంజమ్మ, టి.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రాంరెడ్డి, ఏఓ కృష్ణకుమార్, ఏఈఓ రాజు, మానిటరింగ్ అధికారి రమేష్, కార్యదర్శి యాదగిరిరెడ్డి, సిబ్బంది రాకేష్, మహేష్, పర్వతాలు పాల్గొన్నారు.

మండల కేంద్రం కల నెరవేరేనా?

- అటకెక్కిన ప్రకటనలు, ప్రతిపాదనలు
- సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఇర్విన్ వాసులు



ఇర్విన్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మాడ్గుల: ఇర్విన్ మండల కేంద్రం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని పరిధి గ్రామాల ప్రజలు సుదీర్ఘ కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్.. జూలై 30, 2022న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో గత ప్రభుత్వం మాడ్గుల మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ.. ఇర్విన్ నూతన మండల కేంద్రంగా ఏర్పాటుకు జూన్ 28, 2023న నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం ఇర్విన్, బ్రహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అన్నెబోయినపల్లి, సుద్దపల్లి, గిరికొత్తపల్లి, కలకొండ, రమణంపల్లి రెవెన్యూ గ్రామాల పరిధి 19 పంచాయతీలతో ఇర్విన్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తూ పక్షం రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ తరువాత మండల కేంద్రం ఏర్పాటుపై ఎలాంటి సమాచారం, స్పష్టత లేకపోవడంతో ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అసలు మండల కేంద్రం అవుతుందా లేదా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోరిక మేరకు ఇర్విన్ మండల కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుల వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

యాచారం: కుల వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని పండుగలను గౌరవంగా జరుపుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామంలో ఆదివారం రాత్రి యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల్లో సదర్ ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. అన్ని మతాలు, కులాలను గౌరవిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

మహేశ్వరం ఎంపీడీఓ శైలజ, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి



మహేశ్వరం: మాట్లాడుతున్న అధికారులు



తుక్కుగూడ: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వాణి

మహేశ్వరం: కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాలులో సమగ్ర సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సర్వే ప్రశ్నావళిపై అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఎవరికి కేటాయించిన ఇళ్లకు వారు వెళ్లి, సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించాలని కోరారు. ఎంఈఓ కస్నా నాయక్, ఎంపీఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా..

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనకు పుర ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి కోరారు. పురపాలక కార్యాలయం సమావేశ మందిరంలో ఎన్యూమరేటర్లకు కులగణన పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు 70 మంది ఎన్యూమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లను నియమించామని పేర్కొన్నారు. వీరికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలను సవివరంగా సేకరించాలని సూచించారు. తప్పులు లేకుండా, పారదర్శకంగా సర్వేను నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్, మల్లేశ్, జంగయ్య, వార్డు అధికారులు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.